www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 20 జూన్ 2025

'అన్నమాచార్య'లో ఎల్‌ఎల్‌బి కోర్సుకు బిసిఐ అనుమతి

అన్నమాచార్య యూనివర్సిటీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ) అన్నమాచార్య యూనివర్సిటీకి మూడు సంవత్సరాల ఎల్‌ఎల్‌బి డిగ్రీ కోర్సు ప్రారంభించేందుకు అనుమతి మంజూరు చేసిందని యూనివర్సిటీ ఛాన్సలర్ చొప్పా గంగిరెడ్డి పేర్కొన్నారు. ఈ అనుమతి ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ఒక సెక్షన్‌లో 60 మంది విద్యార్థులు ప్రవేశించేందుకు అవకాశం కల్పించారన్నారు. ఈ అనుమతిని పొందడంలో కృషి చేసిన లా డిపార్ట్‌మెంట్ బృందాన్ని ప్రశంసించారు. ఇది యూనివర్సిటీ అభివృద్ధిలో కీలకమైన ముందడుగని అభిప్రాయపడ్డారు. వైస్ ఛాన్సలర్ ఇ.సాయిబాబారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇదే తొలి మూడు సంవత్సరాల ఎల్‌ఎల్‌బి కోర్సు అని, ఇప్పుడు విద్యార్థులు న్యాయ విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇది స్థానిక విద్యార్థులకు ఒక గొప్ప అవకాశమని తెలిపారు. ప్రస్తుతం లా కోర్సు అత్యంత ప్రముఖమైన కోర్సులలో ఒకటని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి కోరారు.

టమోటా రైతుకు ట్రే కష్టాలు

- అందుబాటులో లేని సబ్సిడీ ట్రేలు
- సరుకు తరలించడానికి నానా అవస్థలు
- అదనంగా 5 వేల ఎకరాల్లో సాగు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు

ట్రేలు లేకపోవడంతో తోటలోనే వదిలేసిన టమోటా పంట

అందుబాటులో లేని టమోటా రవాణాకు అవసరమైన ట్రేలు

ప్రజాశక్తి - రామసముద్రం

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా టమోటా పంటను మార్కెట్‌కు తరలించడానికి రైతులకు ట్రేలు దొరకడంలేదు. గత సంవత్సరం మదనపల్లె డివిజన్ పరిధిలో దాదాపు 14 వేల ఎకరాల్లో టమోటా సాగు చేశారు. ఈ సంవత్సరం దాదాపు 20 వేల ఎకరాల్లో టమోటా పంట సాగు చేశారు. దీనికి తోడు పంట దిగుబడులు పెరిగాయి. ధరలు లేక టమోటా సాగు రైతులకు నష్టాలను మిగుల్చుతోంది. రోజుకో ధరతో పెట్టుబడులు సైతం రాకపోగా సరుకు తరలించేందుకు అవసరమైన ట్రేలు కూడా అందడం లేదు. నిర్ణీత వ్యవధిలో కోత కోయలేక, సరఫరా చేయలేక రైతులు విలవిలలాడుతున్నారు. టమోటా మండీ యజమానులు అవసరమైన మేర ట్రేల సరఫరా చేయక పోవడంతో తోటలోనే టమోటా రాశులు పోసి ట్రేలకోసం ఎదురుచూస్తున్నారు. టమోటా సాగు రైతులకు నష్టాలను మిగుల్చుతోంది. రోజుకో ధరతో పెట్టుబడులు సైతం రాక ఓ వైపు మరో వైపు కనీసం సరుకు తరలించేందుకు అవసరమైన ట్రేలు కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉండడంతో రైతులు విలవిలలాడుతున్నారు. టమోటా పంటలు చేరవేసుకునేందుకు అవసరమైన ప్లాస్టిక్ ట్రే బాక్సులు లేకపోవటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట దిగుబడులను మార్కెట్‌కు తరలించుకునేందుకు అవసరమైన బాక్సులు లేకపోవడంతో పంట కోయడానికి కూడా రైతులు వెనుకడు గువేస్తున్నారు. మండల వ్యాప్తంగా ప్రస్తుతం టమోటా పంటలను అధికంగా సాగుచేస్తున్నారు. కొద్దిసంవత్సరాలుగా టమోటా సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారు. ఆయా పంటలకు సంబంధించి తెగులు, గిట్టుబాటు ధర లభించ కపోవడం వంటి అనేక సమస్యలు ఎదుర్కొనాల్సి వచ్చింది. ప్రస్తుతం పంట ఉత్పత్తులు తరలించుకునేందుకు ప్లాస్టిక్ ట్రే బాక్సులు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోతకు వచ్చిన పంటను ట్రే బాక్సులు లేకపోవడంతో పొలంలోనే వదిలివేస్తున్న పరిస్థితి నెలకొంది. మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, ఎన్.వడ్డిపల్లి శ్రీనివాసపురం, కొలర్, చెన్నై తదితర ప్రాంతాలకు మార్కెట్‌కు తరలించుకునేందుకు అవసరమైన బాక్సులు సరఫరా చేసేవారు లేక పొలాల్లోనే గుట్టలుగా పోసి ఉంచుతున్నామని, రోజుల తరబడి నిల్వ ఉండటంతో కుళ్లి పోతున్నాయంటున్నారు. కొంతమంది రైతులు పంట కోయకుండా పొలంలోనే వదిలివేస్తున్నారు. గతంలో దళారులకు పంట విక్రయించడంతో వారే ట్రేలు తీసుకువచ్చి పంట తరలించుకునేవారు. అయితే ట్రేలు లేకపోవడంతో సరుకు కోసేందుకు కూడా అవకాశం లేక తోటల్లోనే కాయలు వది లేయాల్సి వస్తోంది. అసలే గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్న రైతులకు ట్రేలు కూడా అందుబాటులో లేక విలవిలలాడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో టమోటా కిలో రూ.12 ఉండగా, మధ్యవర్తులు కిలో రూ.4 నుంచి రూ.6 వరకు కొనుగోలు చేస్తుండడంతో పెట్టుబడి ధరలు కూడా రావడం లేదని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.

ట్రేలు లేక పంటను దిలేశాం

టమోటా ట్రెలు లేక పంటను చేలోనే వదిలేసినాను. రేపోమాపో ట్రేలు దొరికినా మాగిపోయిన కాయలు మాత్రమే కోసే పరిస్థితి వచ్చింది. మాగిన కాయలు మార్కెట్లో ధరలు పలకడంలేదు. బాడుగ వాహనదారులు నానా అవస్థలు పడి మార్కెట్లో ట్రేలు సేకరించి తీసుకొస్తున్నారు. ట్రేలు దొరక్క చాలా ఇబ్బందులు పడుతున్నాము.

- వై.ప్రభాకర్‌నాయుడు, రైతు, కమ్మవారిపల్లి.

ప్రభుత్వం ఆదుకోవాలి

వారానికి ఒక్కసారి కోత కోయడానికి కూడా ట్రేలు దొరకడంలేదు. మదనపల్లె మార్కెట్లో కూడా ట్రేలు దొరకడంలేదు. మాకు దగ్గరగా ఉన్న కర్ణాటకలోని శ్రీనివాసపురం, కోలార్, ఎన్.వడ్డిపల్లి మార్కెట్లుకు తీసుకోపోవలన్నా అక్కడ కూడా ట్రేలు దొరకడంలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి. లేకపోతే తీవ్రంగా నష్టపోతాం.

- నరసరాజు, రైతు, ఎర్రనేలపల్లె.

అధికంగా పంట సాగైంది

మదనపల్లె డివిజన్ పరిధిలో దాదాపు 14 వేల ఎకరాల్లో టమోటా సాగు చేశారు. ఈ ఏట దాదాపు 20 వేల ఎకరాల్లో పంట సాగు చేశారు. పంట దిగుబడులు పెరిగాయి. ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై రైతులు ట్రేలు సొంతంగా కొనుగోలు చేసుకోవాలి. ప్రభుత్వం దాదాపు ఒక్కో ట్రెకు రూ.120 అందిస్తుంది.

- ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి, రామసముద్రం.

లాసెట్‌లో మెరిసిన విద్యార్థులు

- మూడేళ్లలో 4వ, ఐదేళ్ల కోర్సులో 1, 6వ, పీజీలో 2వ ర్యాంకులు సాధించిన విద్యార్థులు
- ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పలువురు అభినందనలు

లోకేశ్వరి (2వ ర్యాంకు)

యు.వి.రమణ (6వ ర్యాంకు)

రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించిన గ్రీష్మకు తీపి తినిపిస్తున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి-పీలేరు/మదనపల్లె అర్బన్/ఒంటిమిట్ట

ఎపి లాసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. రాష్ట్ర స్థాయిలో మూడేళ్ళ కోర్సులో రాయచోటికి చెందిన వి.రమేష్ నాల్గవ ర్యాంకు సాధించారు. ఐదేళ్ల కోర్సులో పీలేరుకు చెందిన పల్లపు గ్రీష్మ మొదటి ర్యాంకు, మదనపల్లెకు చెందిన ఎం.వెంకటరమణ ఆరవ ర్యాంకు సాధించారు. పీజీ ఎల్‌సెట్‌లో రాజంపేట నియోజక వర్గంలోని ఒంటిమిట్టకు చెందిన యనమల లోకేశ్వరి ద్వితీయ ర్యాంకు సాధించారు. ర్యాకులు సాధించిన వారందరికీ పలువురు అభినందనలు తెలియజేశారు. ఎపి లాసెట్ ప్రవేశ పరీక్షలో పీలేరుకు చెందిన పల్లపు గ్రీష్మ రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించింది. పీలేరులో న్యాయవాదిగా పనిచేస్తున్న ముడుపులు వేముల రాయలవారిపల్లెకు చెందిన పల్లపు జయశంకర్ కుమార్తె అయిన గ్రీష్మ పీలేరు లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో సిఇసి గ్రూపులో ఇంటర్ అభ్యసించింది. ప్రభుత్వం వెలువరించిన ఐదేళ్ల కోర్సు లాసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో 107 మార్కులు సాధించి ఆమె ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన గ్రీష్మ ఇంటిలో ఆమె తల్లిదండ్రులు, బంధువులు, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తమ కళాశాల విద్యార్థి లాసెట్‌లో ఫస్ట్ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపల్ కె.నాగార్జునరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఆర్.సుధానందరెడ్డి, డైరెక్టర్లు పి.జనార్ధనరెడ్డి, ఎం.లోకేశ్వరరెడ్డి, ఎస్.చంద్రశేఖర్, ఎ.చంద్రశేఖర్ నాయుడు అభినందించారు. **మదనపల్లె అర్బన్ :** ఐదేళ్ల ఫలితాల్లో మదనపల్లెకు చెందిన ఉప్పు వెంకటరమణ 104 మార్కులు సాధించి ఆరవ ర్యాంకుతో సత్తా చాటాడు. గుర్రంకొండ మండలం, నడిమి కండ్రిగ పంచాయతీ, చింతమాకులపల్లెకు చెందిన వెంకటేష్, సిద్ధమ్మ దంపతుల కుమారుడు వెంకటరమణ ప్రశాంత్‌నగర్‌లో ఉన్న అక్క వద్ద ఉంటూ ఇంటర్ చదివాడు. లాసెట్‌లో సత్తాచాటి ఆరో ర్యాంక్ సాధించడంతో పలువురు అతన్ని ప్రశంసిస్తున్నారు. **ఒంటిమిట్ట :** ప్రభుత్వం విడుదల చేసిన ఎపి పీజీ ఎల్‌సెట్‌లో ఒంటిమిట్టకు చెందిన యనమల లోకేశ్వరి రాష్ట్ర స్థాయిలో 108 మార్కులతో ద్వితీయ ర్యాంకు సాధించారు. ఆమె గీతం యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బి పూర్తి చేశారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులు సుధామణి, రమణ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. లోకేశ్వరి తల్లి సుధామణి న్యాయవాదిగా పనిచేస్తున్నారు. హైదరాబాదులోని శ్రీచైతన్య ఐఎఎస్ అకాడమీలో ఇంటర్‌లో చేరి హెచ్‌ఆసి గ్రూపు తీసుకుని స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది.

ప్రభుత్వ ఉద్యోగులు హద్దు మీరితే చర్యలు తప్పవు

- డిజిటల్ అసిస్టెంట్ బాబా ఫక్రుద్దీన్‌పై కఠిన చర్యలు తీసుకుంటాం
- దాడిలో గాయపడ్డ బాధితులను పరామర్శించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్, జెసి, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంలోని వడిగలవారిపల్లి గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బాబా ఫక్రుద్దీన్ దురుసుగా ప్రవర్తించిన ఘటనపై కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆగ్రహం వ్యక్తం చేసి అతనిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం గండువారిపల్లికి చెందిన అనూరాధ ఆమె భర్త శంకర్, వారి కుటుంబ సభ్యులను కలెక్టర్ గండువారిపల్లిలోని వారి ఇంటికి స్వయంగా ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున వారికి క్షమాపణలు తెలిపి బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 18న శంకరప్ప, ఆయన కుటుంబ సభ్యులు గ్రామ సచివాలయానికి వెళ్లి అక్కడ డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బాబా ఫక్రుద్దీన్‌ను తల్లికి వందనం నగదు తమ ఖాతాలోకి రాలేదని అడగగా అతను వారిపై భౌతిక దాడి జరిగిన ఘటనపై మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌తో విచారణ కమిటీ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. భౌతిక దాడి ఘటన వాస్తవమేనని నివేదికలో తేలిందన్నారు. డిజిటల్ అసిస్టెంట్‌పై శాఖపరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి జిల్లా యంత్రాంగం అండగా నిలుస్తుందని వారి సమస్యలన్నీ పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రీ సర్వేపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదులలో ముఖ్యమైన సమస్య జాయింట్ ఎల్‌పిఎంగా ఉందని దీనివల్లనే తల్లికి వందనంలో కొంతమంది సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 25న గ్రామసభ నిర్వహించి గ్రామస్తుల నుండి అర్జీలను తీసుకుని వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి అయ్యే ఆస్పత్రి ఖర్చులను స్వయంగా తానే భరిస్తానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి సంబంధించిన డిజిటల్ అసిస్టెంట్‌ను వేరే డిజిటల్ అసిస్టెంట్‌తో మ్యాప్ చేయాలని, సచివాలయ ఉద్యోగులందరికీ కౌన్సిలింగ్ ఇచ్చి ప్రజలతో ఏ విధంగా ప్రవర్తించాలో తెలియజేయాలని ఎంపిడిఒను ఆదేశించారు. ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించిన గుమ్మసముద్రం డిజిటల్ అసిస్టెంట్ బాబా ఫక్రుద్దీనుపై బి.కొత్తకోట పోలీసుస్టేషనులో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసామని తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ వారిని ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలతో మాట్లాడేటప్పుడు మానవతా దృక్పథంతో మెలగాలని సూచించారు. పరామర్శలో కలెక్టర్‌తో పాటు జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, ఎంపిడిఒ కృష్ణవేణి, తహశీల్దార్ భావాజాన్, మండల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఉద్యోగులు

జిఒ 5ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులకు బదిలీలు, రేషనలైజేషన్ కోసం విడుదల చేసిన జిఒ నెంబర్-5ను రద్దు చేయాలని కోరుతూ మదనపల్లె మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీలకి గురువారం సచివాలయం ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయిస్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజ, శరత్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జిఒ వలన సచివాలయం ఉద్యోగులకు ఇబ్బందికరంగా ఉందని, దీనిని రద్దు చేయాలని కోరారు. ఈ ప్రక్రియ వలన సచివాలయం ఉద్యోగులు స్వంత మండలం, మున్సిపాలిటీలలో ఉద్యోగం చేయకూడదనే నిబంధన ఉందని, దీని వలన సచివాలయం ద్యోగులకు సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. సొంత మండలం, మున్సిపాలిటీలలోనే పోస్టింగ్స్ ఇవ్వాలని కోరారు. రేషనలైజేషన్ ప్రక్రియ చేసిన తరువాతనే బదిలీలు చేయాలని కోరారు. రేషనలైజేషన్ అనేది ఎలా చేస్తారు, ఎవరిని చేస్తారు అనేది స్పష్టత లేకుండా జిఒను విడుదల చేశారని, దీని వలని సీనియర్లకు నష్టం వాటిల్లుతుందన్నారు. దీనిని సవరించి, రేషనలైజేషన్ ప్రక్రియ తరువాత మిగులు ఉద్యోగులను ఎక్కడ నియమిస్తారో స్పష్టత ఇచ్చిన తరువాతనే బదిలీలు చేయాలని కోరారు. జాయినింగ్ తేదీ నుండి సర్వీసును పరిగణనలోకి తీసుకొని రెండు నొషనల్ ఇంక్రిమెంట్లను ఇవ్వాలని కోరారు. ఆలస్యంగా ప్రొబేషన్ ప్రకటించి నందుకు 9 నెలలు కాలానికి అరియర్స్ మంజూరు చేయడంతో పాటు అందరికి ప్రమోషన్ ఛానల్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజకుమార్‌రెడ్డి, శరత్ కుమార్‌రెడ్డి, అభిషేక్, వినోద్ కుమార్, రాజారెడ్డి, హేమలత, నందిని, ఆనంద, మునిస్వామి, హరి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని ఉర్దూ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులపై ఉందని విశ్రాంత హెచ్‌ఎం నజీర్ అన్నారు. గురువారం చింతపర్తి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం, బెల్ట్, షూలు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు సన్నబియ్యంతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం, కోడిగుడ్డు, చిక్కీలతో పాటు మెరుగైన విద్యను అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించడం వలన సామాజికంగా, ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉందని, సమాజంలో మంచి పౌరులుగా ఎదగడానికి, మంచి ఉద్యోగాలను పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఖమ్రున్నిసా, రిజ్వానా బేగం, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

ప్రతి తల్లికీ గౌరవం

ప్రజాశక్తి-రాయచోటి : తల్లికి వందనం ప్రతి తల్లికి గౌరవం అని టిడిపి యువ నాయకులు మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలం లోని చెన్నముక్కపల్లెలో 'తల్లికి వందనం' పథకంపై విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 43,248 మంది లబ్ధిదారులకు రూ.56,22,24,000 కోట్ల నగదు జమ చేసిన ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాలకు భరోసా కలిగించేలా తల్లికి వందనం పథకాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేస్తోన్న కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మురికి నాటి వెంకటసుబ్బారెడ్డి, టిడిపి నాయకులు కొండారెడ్డి పాల్గొన్నారు

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సికిల్ సెల్ అనీమియా పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ప్రజలు సికిల్ సెల్ ఎనీమియా రక్త పరీక్షలు చేయించుకోవాలని అదనపు డిఎం హెచ్‌ఒ డాక్టర్ శైలజ అన్నారు. గురువారం ప్రపంచ సికిల్ సెల్ అనీమియా దినోత్సవం సందర్భంగా ఎపి ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా వ్యాధి వారసత్వంగా వస్తుందని తల్లిదండ్రుల నుండి జన్యుపరంగా పిల్లలకు వస్తుందన్నారు. ఈ వ్యాధి వచ్చిన వారికి రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్ళ పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్ళు నొప్పులు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కరం, అలసట, తరచుగా వచ్చే అంటూ వ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు, అవయవ వైఫల్యం, పెరుగుదల సమస్యలు వంటి లక్షణాలు ఉంటాయని చెప్పారు. ఈ వ్యాధి నిర్ధారణకు ప్రతి ఆరోగ్య కార్యకర్త దగ్గర కిట్స్ అందుబాటులో ఉన్నాయని కేవలం ఒక చుక్క రక్తంతో వ్యాధి పరీక్షను చేయవచ్చని అన్నారు. మనిషి పుట్టినప్పటి నుండి 40 సంవత్సరాల లోపు ఈ పరీక్షను చేసుకోవాలని వ్యాధి నిర్ధారణ అయితే హైడ్రాక్సి యూరియా మాత్రలు తోపాటు పోలిక్ యాసిడ్ మాత్రలు వేసుకోవాలని, అవసరమైతే రక్తం ఎక్కించాల్సి వస్తుందన్నారు. వ్యాధి స్థాయిని బట్టి ఎముక మజ్జ మారడం జరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో పాఠశాల నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శేఖర్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి మహమ్మద్ రఫీ, అదనపు నోడల్ అధికారి డాక్టర్ నరేష్, యూ పి హెచ్ సి వైద్యులు డాక్టర్ అబ్దుల్ లతీఫ్, డాక్టర్ హాజిరా మరిన్, డిసిపి చెన్నారెడ్డి, హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాసులు, నూర్జహాన్, ఎఎన్‌ఎంలు ఆశా వర్కర్లు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** పట్టణంలోని వెలుగు సంస్థలో మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ (డిడిఆర్ఎస్) నేషనల్ ట్రస్ట్ వారి ఆదేశాల మేరకు వరల్డ్ సికెల్ సెల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ప్రిన్సిపల్ లీనా కుమారి మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధిలో సమస్యలు సాధారణంగా 5 నుండి 6 నెలల వయస్సులో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సికెల్ సెల్ వ్యాధిని ముందుగా మనం కనుగొనడానికి అవసరమైన రక్త పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఇలాంటి రుగ్మతల నుండి మనల్ని మనం కాపాడుకోవటానికి రక్తపరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ఇసి మెంబెర్ ఎం.సుజాత, ప్రిన్సిపల్ లీనా కుమారి, వార్డెన్ స్వీటీ, సోషల్ వర్కర్ గీత, వెలుగు సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు మనోజ్ చంద్ర, శ్రీనిజ ఆధ్వర్యంలో సిహెచ్‌ఒ రాజా పర్యవేక్షణలో ప్రపంచ సికిల్ సెల్ ఎనిమియా వ్యాధిపై ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బందితో పాటు ఆరోగ్య పర్యవేక్షకులు పి.మహేష్, కెవి.సుబ్బారెడ్డి, బివి కృష్ణయ్య, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

నిత్యజీవితంలో యోగా భాగం కావాలి : కలెక్టర్

యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, జెసి, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

యోగాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, నిత్య జీవితంలో ఒక భాగం కావాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. యోగాంధ్ర జిల్లా స్థాయి కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రముఖ పర్యాటక కేంద్రం ఆంధ్ర ఊటీగా పిలవబడే హార్సిలీహిల్స్‌లోని గవర్నర్ బంగ్లా సమీపంలోని పార్క్‌లో పర్యాటక శాఖ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. జెసి ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ శ్రీధర్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ జిల్లా, రాష్ట్రంలోనే ఎత్తైన ప్రాంతమైన హార్సిలీహిల్స్‌లో వెయ్యి మందితో యోగా నిర్వహించామన్నారు. జిల్లాలో ఉన్న అత్యంత సందర్శనీయ ప్రాంతమైన హార్సిలీహిల్స్ యోగా కార్యక్రమం నిర్వహించడం ఆనందించదగ్గ విషయమన్నారు. జిల్లాలో మొట్టమొదటి కార్యక్రమం మదనపల్లిలో మొదలుపెట్టి చిట్టచివరి ఈవెంట్ టూరిస్ట్ ప్రాంతమైన హార్సిలీహిల్స్‌లో జరుపుకుంటున్నామని తెలిపారు. 21వ తారీకు రాయచోటిలో ఐదు వేల మందితో నిర్వహిస్తూనే జిల్లా వ్యాప్తంగా అన్ని హ్యాబిటేషన్స్, అన్ని గ్రామాల్లో యోగా నిర్వహించబోతున్నామని పేర్కొన్నారు. ప్రజల నిత్యజీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలని దాని ద్వారా శారీరక మానసిక, ఆధ్యాత్మిక పరిణితి సాధించవచ్చన్నారు. కాన్సెప్ట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, లావణ్య డాన్స్ అకాడమీ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, ఎడి సర్వేయర్ భరత్ కుమార్, జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం, జిఎస్‌డబ్ల్యూ ఎస్.లక్ష్మీపతి, తహశీల్దార్ భావజాన్, ఎంపిడిఒ కృష్ణవేణి, ఎంఇఒ రెడ్డిశేఖర్, మండల అధికారులు, డిఆర్‌డిఎ, వెలుగు మహిళా సమాఖ్యలు, సంఘ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్‌టిఎ రాష్ట్ర అధ్యక్షులు శ్రీని వాసులురాజు

ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - రాయచోటి

తాజాగా బదిలీ అయిన ఉపాధ్యాయులకు జూన్ నెల వేతనాలు సకాలంలో అందేటట్లు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టిఎ) రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు కోరారు. గురువారం పట్టణంలోని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొజిషన్ ఐడిలు, సిఎఫ్‌ఎంఎస్ అనుసంధానం సమస్యలు లేకుండా ట్రెజరీ అధికారులకు విద్యాశాఖ సమగ్ర నివేదికను పంపాలని కోరారు. కొత్తగా ఏర్పడ్డ పిఎస్ హెచ్‌ఎం పోస్టులు, రీ అపోస్మెంట్ ఖాళీలలో చేరిన ఉపాధ్యాయులకు జూన్ వేతనం సకాలంలో అందేటట్లు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ముందస్తుగా కోరుతున్నామని తెలిపారు. నాన్ డ్రాయిల్ సర్టిఫికెట్‌తో కొత్త పాఠశాలల్లోనే, మండలాలలోనే జూన్ నెల పూర్తి వేతనం చెల్లించేటట్లు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సిఎఫ్ ఎంఎస్‌లో మారిన ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంతును అప్డేట్ చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. గత బదిలీలల్లో మాదిరిగా నెలల పాటు వేతనాలు పెండింగ్ పడకుండా చొరవ చూపాలని కోరారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులకు త్వరలో నిర్వహించే కౌన్సిలింగ్‌లో వారి స్థానిక మండలం లేదా సమీప మండలాలలో పోస్టింగ్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇటీవల నిర్వహించిన బదిలీలలో టెక్నికల్ సమస్యల వల్ల కొన్ని జిల్లాలలో చిన్నచిన్న సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే ఆ సమస్యలు జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా లేదా వ్యక్తిగతంగా డైరెక్టర్ కార్యాలయంలో సమర్పిస్మాని పేర్కొన్నారు. వాటిని వెంటనే పరిష్కరించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లమల రామాంజులు, పకీర, బచ్చల శ్రీనివాసులు, కులశేఖర్ రెడ్డి, గోవిందు, నాగరాజు, చక్రపాణి, భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

బేపారి బషీర్ ఖాన్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి పట్టణానికి చెందిన మైనారిటీనేత హాజీ బేపారి బషీర్ ఖాన్‌ను గురువారం మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి పరామర్శించారు. వారి కుమారుడు బేపారి మహమ్మద్ ఖాన్‌తో ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కుటుంబ సభ్యులకు సూచించారు.అయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజర్ రెహమాన్, వైఎస్‌ఆర్ సిపి మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిమి హారూన్ బాషా,తఫీమ్ హబీబ్,అసాద్, జబీవుల్లా, సూరం వెంకట సుబ్బారెడ్డి ఉన్నారు.

కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భవిష్యత్తు ప్రధాని రాహుల్ గాంధీ

ప్రజాశక్తి-రాయచోటి

రాబోయే రోజుల్లో ఈ దేశానికి కాబోయే ప్రధాని రాహుల్‌గాంధీ అని డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్ అన్నారు. గురువారం రాహుల్‌గాంధీ 55వ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అమీర్ మాట్లాడుతూభారతదేశం లోని ప్రతి పౌరుడు న్యాయం పొందేందుకు, న్యాయం కోసం ఉద్యమాన్ని చేపట్టేందుకు జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయయాత్ర చేసే దేశ ప్రజల గుండెల్లో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారని చెప్పారు. ఆర్ఎస్ఎస్ మాతృ సంస్థ అయినటువంటి బిజెపి కులాలు, మతాలను రెచ్చగొట్టి కేంద్రంలో అధికారం ఎలా చేపట్టాలనే ఆలోచన తప్ప ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బాబా నర్సర్, డిసిసి కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్, సేవాదళ్ అధ్యక్షుడు అమీర్‌బాషా, డిసిసి కార్యదర్శి రమణమ్మ, డిసిసి వైస్ ప్రెసిడెంట్ ఖదీర్, చిన్నమండెం మండల అధ్యక్షుడు షబ్బీర్, రియాజ్, బాబావలి పాల్గొన్నారు.

డీలర్లకు సూచనలు ఇస్తున్న డిటి శ్రీనివాసులు

రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని రేషన్ దుకాణ యజమానులు వినియోగదారుల పట్ల బాధ్యతగా వ్యవహరించి రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ అమర్నాథ్ పేర్కొన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి డి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఉన్న రేషన్ డీలర్లు పూర్తిగా వినియోగదారుల పట్ల బాధ్యతగా పనిచేయాలని అన్నారు. ఈనెల 30వ తేదీలోగా రేషన్ కార్డు దారులు ఇకైవైసీ చేయించుకోవాలి. 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. ఏమైనా చిన్న సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీదేవి, డీలర్లు రామ చంద్రారెడ్డి, రాజామాణిక్యం, కలవాటి శ్రీధర్, కుమార్, రాజా, రవికుమార్ పాల్గొన్నారు.

గ్రామసభ నిర్వహిస్తున్న సర్పంచ్ రెడ్డయ్య

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చెంచర్లపల్లి రెడ్డయ్య తెలిపారు. ఎర్రగుడి గ్రామపంచాయతీ సచివాలయంలో ధర్తీ అభ భాగిదారి అభియాన్ పథకంపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎస్‌టిలలో సంక్షేమ పథకాలు సంపూర్ణంగా అందించడం ఈ పథక ముఖ్య ఉద్దేశమని అన్నారు. గ్రామ సభ ద్వారా ఆధార్‌కార్డు, ఆయుష్మాన్‌భవ కార్డు, పిఎం కిసాన్ యోజన ప్రయోజనాలు, జన్‌ధన్ అకౌంట్ స్కాలర్‌షిప్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ గ్రామ సభలో 8 మందికి ఆయుష్మాన్ భవ కార్డు, 4 రేషన్ కార్డులు నమోదు చేయడం, 25 సికిల్ వ్యాధిపై నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమం గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.నాగమణి, ఎఎన్ఎం పద్మావతి మహిళా పోలీస్ నాగమణి, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

గురుకులంలో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-రామాపురం

ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో2025-26 విద్యా సంవత్సరానికి 6,7,8,9వ తరగతులలో మిగిలి ఉన్న సీట్లు భర్తీ చేయడానికి ఈనెల 20 తేదీ నుంచి 24 వరకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఒకప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష 25న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు. కడప, జిల్లాలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుపాఠశాలల ప్రవేశానికి పరీక్ష కేంద్రంగా రామాపురంలో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త ప్రకటించారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని తెలిపారు.

కర్నూలులో వైద్య పరీక్షలకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

గత నెల 28న మహానాడు సందర్భంగా పులివెందులలో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ జెండాలు చించిన కేసులో అరెస్టు సమయంలో నిందితులుగా ఉన్న ఆరుగురిని పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని జమ్మలమడుగు మెజిస్ట్రేట్ దృష్టికి తీసుకువెళ్లిన విషయం తెలిసిందే. మెజిస్ట్రేట్ తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించాలని పులివెందుల వైద్యులకు ఆదేశించారు.. కానీ ఎలాంటి గాయాలు లేవని పులివెందుల వైద్యులు రిపోర్ట్ ఇచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ 25వ వార్డు కౌన్సిలర్ పి.కిషోర్, కే మల్లికార్జున, వెంకటపతి, మరో ముగ్గురు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆరుగురికి మళ్లీ వైద్య పరీక్షలను కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో 24 గంటల్లో వైద్య పరీక్షలు చేయించి నివేదిక అందజేయాలని ఆదేశించింది. ఆర్డర్ కాపీని గురువారం లాయర్ ఓబుల్ రెడ్డి పులివెందుల అర్బన్ ఎస్ఐ విష్ణు నారాయణకు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 24 గంటల లోపల వారికి వైద్య పరీక్షలు నిర్వహించి నివేదికలను హైకోర్టుకు సమర్పించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.

బాలికలు ఉన్నత స్థాయిలో రాణించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల :బాలికలు బాగా చదువుకుని ఉన్నతస్థాయిలో రాణించాలని ఎస్ఐ నాగమురళి ఆకాంక్షించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న బాలికల పాఠశాలలో గురువారం సమాజం పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోక్సో చట్టం గురించి వివరించారు. గుడ్ టచ్, బ్యాక్ టచ్, సైబర్ క్రైమ్‌కు సంబంధించి అవగాహన కల్పించారు. అన్ని రంగాలలో మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలన్నారు. దేనికి భయపడవద్దన్నారు. ఆటల పోటీలలో అందరూ పాల్గొనాలన్నారు. జికె పోటీలు నిర్వహించి గెలుపొందిన బాలికలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'వెలిగల్లు'లో తగ్గిన నీటిమట్టం

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రంలోని పాపాగ్ని నదిపై వెలసిన వెలిగల్లు రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. నిత్యం రాయచోటి పట్టణానికి మండల కేంద్రానికి నీటిని పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం 415 మీటర్ల నీరు ఉంది. డ్యాం స్టోరేజ్ 2.82 టిఎంసిలు ప్రాజెక్టు నీటి సామర్థ్యం 420మీటర్లు. గత ఐదు సంవత్సరాల కాలంలో అనధికారికంగా నీటిని కాలువలకు వదలడం ద్వారా ఎంతో నీటిని వృధా చేశారు. ఇన్‌ఫ్లో వాటర్ శాతాన్ని కూడా అధికంగా సముద్రంలో కలిసివేశారు. ఈ ఏడాది వర్షాలు పడుతున్నాయి.ప్రాజెక్టు స్టోరేజ్ శాతం నీరు పెరిగితే చుట్టూ గ్రామాలకు తాగునీటితో పాటు సాగునీరు కూడా అందించే అవకాశాలు ఉన్నాయి. రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు, గండికోట రిజర్వాయర్ నుంచి మదనపల్లి వరకు రూ.2200కోట్లతో టెండర్లు కూడా పూర్తయ్యాయి. జూన్ మాసంలో పనులను కూడా ప్రారంభించడానికి రవాణాశాఖ మంత్రి మడిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు వాటర్ గ్రిడ్ ద్వారా రూ.460 కోట్లతో తాగునీటిని శాశ్వత పరిష్కారం దిశగా బాధ్యతలు తీసుకున్నారు. రాబోయే రోజులలో తాగునీటి సమస్య అనేది లేకుండా పోయే అవకాశాలు ఉన్నాయి. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ఎగువ గొట్టివీడు, గోపనపల్లి, చీమల చెరువు పల్లికి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు అందించడానికి కూడా మంత్రి సిద్ధంగా ఉన్నారని టిడిపి నాయకులు చెబుతున్నారు.

వెలిగల్లు ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి మట్టం

అస్తవ్యస్థంగా డ్రైయినేజీ వ్యవస్థ

- రోడ్డుపై పారుతున్న మురుగునీరు
- వర్షం వచ్చిందంటే తప్పని తిప్పలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టని అధికారులు

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులో వర్షం వచ్చిందంటే డ్రెయినేజీ కాలు వల్లోని మురుగు నీరంతా రోడ్లపై ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ నుంచి చుట్టూ ఉన్న ప్రాంతాల్లో డ్రెయి నేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వర్షం వస్తే కాలువల్లోని మురుగునీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. ఆరోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు, వాహ నదారులు ఇబ్బం దులు పడుతున్నారు. దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలకు అవాసా లుగా మారడంతో విషజ్వరాలు ప్రబలు తాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పంచాయతీ అధికారులు ఇఒపిఆర్‌డి, ఆర్‌డ బ్ల్యూఎస్ అధికారులు, కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు జిల్లా కేంద్రాన్ని పంపించారు. అక్కడి నుంచి ఇంకా నిధులు రాకపోవడంతో మురుగు కాలువలపై ఉన్న మూత వేసిన దిమ్మెలను తీసివే యడంతో నీరంతా రోడ్డుపై ఆర్‌టిసి బస్టాండ్,పెద్దూరు కస్పాకు వెళ్లే ప్రతి ఒక్కరూ మురుగు నీటిలోనే వెళ్ళాల్సి వస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కూరగాయలు సంతతో పరి స్థితి మరింత దారుణంగా ఉంటుందని చెబుతున్నారు.బస్టాండ్ సమీ పంలోనే మజీద్ ఉండటంతో ముస్లిములు ఉదయం, సాయంత్రం, నమాజ్ చద వడానికి వెళ్లే సందర్భంలో కూడా మురుగునీరు తొక్కుకుండా పోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మండల కేంద్రంలో ఉన్న ప్రధానమైన డ్రెయినేజీ కాలువ నిర్మాణాన్ని పూర్తి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులే భావితరాల భవిష్యత్తుకు పునాదులు

- ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

విద్యార్థులే భావితరాల భవిష్యత్తుకు పునాదులు అని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు విద్యా మిత్ర కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్కరణలో నూతన మార్పులు తీసుకొస్తూ, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు మంచి విద్యను అందిస్తూ వారి భవిష్యత్తుకు పునాది వేస్తున్నారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు వెలుగు బాట చూపిన సర్వేపల్లి రాధా కృష్ణన్ (విద్యార్థి మిత్ర) కిట్లతో పాటు, యూనిఫాంలు విద్యార్థులకు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ప్రజాధనంతో విద్యలో కూడా రాజకీయాన్ని చేర్చి విద్యార్థులకు ఇచ్చే నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు తదితర కిట్లపై రాజకీయ ప్రేరేపిత జగన్ బొమ్మలు ముద్రణ చేసి విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారని అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన, ఆకర్షణీయమైన, రాజకీయ రంగుల్లేని పాఠ్యపుస్తకాలు, బ్యాగు, బెల్ట్, యూనిఫాంలు, రూ.2,279లు విలువ చేసే కిట్లను కూటమి ప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలిపారు. విద్యార్థులే భావి తరాల భవిష్యత్తుకు పునాదులని, ఒక గొప్ప సంకల్పంతో విద్యలో విలువలు పెంపొందించేం దుకు మంత్రి నారా లోకేష్ ముందుకు పోతున్నారని అన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీ ప్రజా ప్రతినిధులు టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ మాలతి ప్రిన్సిపల్ సోమ శేఖర్, ఎంఇఒ కరీముల్లా, టిడిపి నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ

నిత్యావసర వస్తువులు అందిస్తున్న బాలాజీరాజు

ప్రజాశక్తి-పుల్లంపేట

పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఎస్‌బివిడి సభా ప్రాంగణంలో ఎస్‌బివిడి సభా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలాజీరాజు, సంఘ అధ్యక్షులు సుబ్బనరసారెడ్డి చేతుల మీదుగా దళవాయి పల్లెకు చెందిన రూపనగుడి సెకా పుట్టినరోజు సందర్భంగా నిత్యవసర సరుకుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా నిత్యావసర సరుకులు పంపిణీ అనేది ఒక మంచి కార్యక్రమమని అన్నారు. నేటి యువత అనవసరమైన ఖ ర్చులు పెడుతూ చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని, అలా కాకు ండా ఇలాంటి నిరు పేదలకు సేవలందించేలా యువతలో మార్పు రావాలని తెలిపారు. సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి మాట్లా డుతూ సెకా పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చాలామంది పేద వారు ఆకలితో అలమటిస్తున్న సందర్భాలు చాలా చూస్తున్నామని ప్రతి ఒక్కరు కూడా తమ తమ పుట్టినరోజు, పెళ్లిరోజు కార్యక్రమాలలో అనవసర ఖర్చులు చేయకుండా పేదవారిని గుర్తించి పది రోజుల పాటు వారు కడుపు నింపుకునేందుకు అవకాశం కల్పిద్దామని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వాహిద్, కోశాధికారి నరసింహులు, బాలాజీ పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ నూతన గ్రామ కమిటీ

-7న జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-కలకడ

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ కమిటీ నూతన నిర్మాణ కార్యక్రమం వేగవంతంగా జరుగుతోంది. పీలేరు నియోజకవర్గంలోని గుర్రంకొండ, కలకడ , కలికిరి మండలాల ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌సి సమీక్ష సమావేశం కలకడలో నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి దానియేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌ఎస్ ఉద్యమం ప్రారంభమై 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో మందకృష్ణ సారథ్యంలో వర్గీకరణ సాధించుకోవడం మనందరికీ గర్వకారణమని అన్నారు. అన్ని గ్రామాలలో నూతన గ్రామ కమిటీ నిర్మాణాన్ని బలోపేతం చేసుకుని తద్వారా మండల నిర్మాణాన్ని పటిష్టంగా చేపట్టి జులై 7న ఘనంగా గ్రామ గ్రామాన జెండా ఆవిష్కరణ నిర్వహించాలని తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలలో గ్రామాల్లో నిర్మాణానికి అడ్డు తగిలి నాయకత్వాన్ని ఇబ్బందులు పెడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జిగండికోట వెంకటేష్, కో-ఇన్‌ఛార్జిలు ముల్లంగి రెడ్డప్ప, ముదివేడు శ్రీనివాసులు, వెంకటరమణ కలకడ మండల నాయకత్వం హరినాథ, వర్ల రెడ్డయ్య,డాక్టర్ రమణ, కలికిరి మండలం సుండు రెడ్డప్ప, గుర్రంకొండ మండలం శెట్టిపల్లి రెడ్డప్ప, గాలివీటి రెడ్డి ఆంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దానియేల్

బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సన్మానం

సన్మానం పొందిన ఉపాధ్యాయులతో హెచ్‌ఎం, విద్యార్థులు

ప్రజాశక్తి-నందలూరు

మండల కేంద్రంలోని నందలూరు జడ్‌పిహైస్కూల్‌లో విధులు నిర్వహిస్తు బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు,హైస్కూల్ చైర్మన్ ఉపేంద్ర అధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బధిలిపై వెలుతున్న రౌఫ్‌భాషా, రజిని, క్రిష్ణయ్య, సురేష్, మూర్తి, వరప్రసాద్‌లను పూలమాల, శాలువతో సన్మా నించారు. విద్యార్థులు తమ గురువులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సర్వ సాధారణమేనని అన్నారు. బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణపై చక్కని తర్ఫీదునిచ్చి వారికి అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. బదిలీపై వెళుతున్న పాఠశాలలో కూడా మంచిపేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మంచి క్రమశిక్షణ అలవర్చు కోవాలని సూచించారు. ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీహరి, పాఠశాల ఉపాధ్యా యులు, విద్యార్థులు స్థానికులు పాల్గొన్నారు.

పాఠశాల సంసిద్ధ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సుగుణమ్మ

ఘనంగా పాఠశాల సంసిద్ధత

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాయచోటి ఎంపిపి ఎస్ మార్కెట్ స్ట్రీట్ స్కూల్ ఆధ్వర్యంలో పాఠశాల సంసిద్ధ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎసిడిపిఒ సుగుణమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని పాఠశాల సంసిద్ధత కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల ప్రారంభంలో పాఠశాలలో చేరు పిల్లలకు పాఠశాల వాతావరణం ఆటపాటల ద్వారా సన్నద్ధం చేయడమే పాఠశాల సంసిద్ధత కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. పిల్లలను ఆటపాటల ద్వారా విద్యాసామర్థ్యాలను పెంచవలసిన బాధ్యత ఉందని అన్నారు. పిల్లలతో చదివించడం, రాయించడం, సంఖ్య జ్ఞానా న్ని పరిపూర్ణంగా తేవాలని అన్నారు. కార్యక్రమంలో మోడల్ ఫౌండేషన్ స్కూల్ ఉపాధ్యాయులు సురేంద ర్‌రెడ్డి, నాగరాజు, పదం కో-ఆర్డినేటర్ రాజశేఖర్, జిపి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రాహుల్, సూపర్‌వైజర్ శివ, సుబ్బమ్మ, పద్మజ, అంగన్వాడీ కార్యకర్త విజయమ్మ, అరుణ, ఇందిరా, మజాహార్, ఓబులమ్మ పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ అధికారిగా జాఫర్

ప్రజాశక్తి-రామసముద్రం

మండల నూతన వ్యవసాయ అధికారిగా జాఫర్ గురువారం బాధ్య తలు స్వీకరించారు. ఈయన అనంతపురం జిల్లా కంబదురు మండలం నుండి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎఒ మోహన్‌కుమార్ చౌడేపల్లి మండ లానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహ ణలో రైతులకు సహకరించి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు.

నేడు ప్రభుత్వ పెన్షనర్ల అత్యవసర సమావేశం

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలపై చర్చించడానికి శుక్రవారం పీలేరులో ప్రభుత్వ పెన్షనర్ల అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వగళ్ళ చంద్రారెడ్డి, ఎర్రమరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గత పార్ల మెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం బిల్లును ప్రవేశ పెడుతూ పెన్షనర్లపై విరుచుకుపడుతూ ఇకముందు పిఆర్‌సి, డిఎ బిల్లుల మంజూరు విషయం ప్రభుత్వ విచక్షణజ్ఞానంపై ఆదారపడి ఉంటుందని అన్నారు. అదే సమయంలో పాకిస్తాన్, భారత్ మధ్య యుద్ధం రావడంతో ప్రభుత్వం ముందు సంఘాలు బిల్లు పెట్టలేక పోయాయని, అన్నారు. అందులోని నియమ, నిబంధనలను తొలగించుకోకపోతే పెన్షనర్ల జీవితాలు అగమ్య గోచరంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ అంశాలపై చర్చించి సుప్రీం కోర్టును ఆశ్రయించక పోతే పెన్షనర్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. అందుకోసం స్థానిక పాత బస్టాండ్ లోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో జరిగే సమావేశానికి పెన్షనర్లు అందరూ తప్పక హాజరు కావాలని వారు కోరారు.

ప్రయివేటు పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రయివేటు పాఠశాలల్లో సామాన్య ప్రజల నుండి వసూలు చేస్తున్న అధిక ఫీజులను రాష్ట్ర ప్రభుత్వం ఆరికట్టాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా కో-కన్వీనర్ దాదాపీర్ డిమాండ్ చేశారు. గురువారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మొద్దు నిద్రలో నుండి లేచి ప్రయివేటు పాఠశాలల అక్రమ ఫీజులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రయివేటు యాజమాన్యాలు అధిక ఫీజులను వసూలు చేసి పేదలను ఆర్థికంగా ఇబ్బందులు పెట్టుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లికివందనం పథకాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రయివేటు పాఠశాల యాజమాన్యం విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కినట్లు ఆరోపించారు. ప్రయివేటు పాఠశాలలో కేవలం ఎల్‌కెజీ నుండి పదో తరగతి వరకు రూ.12,000 నుండి రూ.40 వేలు వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్, కలెక్టర్, డిఇఒ, ఎంఇఒలు ఎందుకు పట్టించుకోలేదో చెప్పాలని వారు ప్రశ్నించారు. సమావేశంలో మండల ఆప్ సభ్యులు ఎస్‌ఎండి గౌస్ నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పురుగు మందు తాగి డ్రైవర్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డ సంఘటన గురువారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కనకంటి వారిపల్లెకు చెందిన సాంబశివ టెంపో డ్రైవర్‌గా పని చేస్తుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు బాధితున్ని వెంటనే మదన పల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించినా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చిన్నమండెం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు..మండలంలోని దేవగుడిపల్లి గ్రామం, రాజుకాలనీకి చెందిన కాల్వ వెంకటరమణ రాయచోటి-చిన్నమండెం ప్రధాన రహదారిపైన హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా స్కూటర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. క్షతగాత్రుని వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు కింద పడి వృద్ధురాలు...

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రమాదవశాత్తు రైలు కిందపడి ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని చింతలవారిపల్లి సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద గురువారం చోటు చేసుకొంది. వివరాలు.. మండలంలోని చింతలవారిపల్లికి చెందిన కుడుము బుజ్జమ్మ(80) తన అల్లుడి వద్ద ఉంటుంది. ఆమెకి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంట్లో అల్లుడు లేని సమయంలో బయటకు వెళ్లింది. ఊరి సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద ఉదయం 11 గంటల సమయంలో పాకాల నుండి గుంతకల్ వెళ్తున్న రైలు కింద ప్రమాదవశాత్తు పడడంతో రెండు కాళ్లు తెగిపోయాయి. దీంతో వృద్ధురాలు బుజ్జమ్మ మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాపర్ వైరు చోరీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని బీరంగి గ్రామ సమీపంలో ఈనెల 15వ రాత్రి రైతు ఆదినారాయణ వ్యవసాయ పొలంలో గల ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు పగలగొట్టి అందులో ఉండిన 15 కేజీల కాపరి వైరును దొంగలించుకుని వెళ్లారు.15 కేజీల కాపర్ వైర్ విలువ సుమారు 75 వేల రూపాయలు ఉంటుందన్నారు. ఈ సంఘటన గురించి ఎపిఎస్‌పిడిసిఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ గిరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు ఎక్కువ జరుగుతున్నాయని వీటిని అరికట్టాలని రైతులు విజ్ఞప్తి చేశారు.